# మనం
## హైదరాబాద్
### రంగారెడ్డి | మేడ్చల్
సోమవారం | 22 | జూన్ | 2026 పేజీలు: 8




# నీట్ పరీక్ష ప్రశాంతం

**నీట్ పరీక్షా నిర్వహణను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మన చౌదరి**



నీట్ పరీక్ష జిల్లాల్లో ప్రశాంతంగా జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి మండలంలో జేఎన్టీయూ కాలేజీ లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష నిర్వహణను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. కాలేజీలో వివిధ విభాగాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షను కలెక్టర్ పరిశీలించారు.

2



7

## ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో
# 'ఇందిరమ్మ' చీరల పంపిణీ

**మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మోతే శ్రీలత శోభన్ రెడ్డి**



## జిహెచ్ఎంసి అధికారులా...
# మజాకా...



ట్యాంకుల నుండి నీరు వృధాగా పోతున్న పట్టించుకోని అధికారులు ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా జర నీటిని కాపాడండి సార్

5

## మానవ హక్కుల రక్షణలో
# హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలి

**రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**






మానవ హక్కుల రక్షణలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత రెడ్డి అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మహాదేవపురం డివిజన్లో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ నవోదయ సిద్దార్థ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.

2

# మానవ హక్కుల రక్షణలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలి

**రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): మానవ హక్కుల రక్షణలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత రెడ్డి అన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మహాదేవపురం డివిజన్లో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ నవోదయ సిద్ధార్థ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి నూతన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో నిస్సహాయులకు, బాధితులకు అండగా నిలవడంలో మరియు మానవ హక్కుల రక్షణలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వ హయాంలో చట్టానికి, మానవ హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా సంస్థ ప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.






మహాదేవపురం డివిజన్కు విచ్చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ముఖ్య ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# నీట్ పరీక్ష ప్రశాంతం

**నీట్ పరీక్షా నిర్వహణను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మన చౌదరి**

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): నీట్ పరీక్ష జిల్లాల్లో ప్రశాంతంగా జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి మండలంలో జేఎన్టీయూ కాలేజీ లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష నిర్వహణను మేడ్చల్ మల్కాజిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. కాలేజీలో వివిధ విభాగాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షను కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణను సీసీ కెమెరాల ద్వారా కలెక్టర్ పర్యవేక్షించారు. జేఎన్టీయూలోని వివిధ విభాగాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష సెంటర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వాహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఆర్డీవో శ్యాంప్రకాష్, కూకట్పల్లి ఎంఆర్ఓ అశోక్ కుమార్, బాలానగర్ ఎమ్మార్వో శ్రీనివాస్, మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూకట్పల్లి విభాగ్, కూకట్పల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిజాంపేట్లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్ మాట్లాడుతూ, 'యోగ మన నిత్యజీవితంలో ఎంతో అవసరం. విద్యార్థులు తమకు ఉన్న సమయంలో కొంత సమయాన్ని యోగకు కేటాయించాలన్నారు.. యోగ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని మనిషికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, యోగ కూడా అంతే ముఖ్యమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర, జిజ్ఞాస కార్యకర్తలు సుజిత్, సుస్మిత, సౌమ్య, శతాన్, నిహాల్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ కోసం జీవించిన మహనీయుడు ఆచార్య జయశంకర్..

**– 15వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..**

**– తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర చిరస్మరణీయం**

చర్లపల్లి, జూన్ 21 (మనం న్యూస్): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా చర్లపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జేఏసీ కన్వీనర్, పోలవరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కో-కన్వీనర్ కీర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. 1952 నుంచి తెలంగాణ ఉద్యమాలకు సాక్షిగా నిలిచిన ఆయన, మలిదశ ఉద్యమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు మార్గదర్శకత్వం వహిస్తూ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు చాటారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జీవించి, తెలంగాణ కోసమే మరణించిన మహనీయుడిగా ఆయనను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# మంచినీటి ట్యాంకర్ల అరాచకాలకు ఇదే నిదర్శనం

**మితిమీరిన వేగంతో ప్రయాణం ఎలాంటి లైసెన్స్ లేకుండా ట్యాంకర్ డ్రైవర్లు**

**మేడ్చల్ లో ట్యాంకర్ బోల్తా: తప్పిన పెను ప్రమాదం**



మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): మంచినీటి ట్యాంకర్ డ్రైవర్ల అరాచకాలు మితిమీరి పోతున్నాయి. రోడ్లపై అతివేగంగా వెళ్లడమే కాకుండా ప్రమాదకరంగా మంచినీటి ట్యాంకర్లను తీసుకెళ్తూ రోడ్లపై హంగామా సృష్టిస్తున్నారు. మేడ్చల్ పట్టణంలో ఎటు చూసినా మంచినీటి ట్యాంకర్ లే దర్శనమిస్తున్నాయి. మేడ్చల్ పట్టణంలో దగదగ మండుతున్న ఎండల వల్ల మంచినీటి ఎద్దడి నెలకొంది. దీనిని ఆసరా చేసుకుని ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని తీసుకొస్తూ జోరుగా మంచినీటి దందాను కొనసాగించారు. బోర్ల ద్వారా ట్యాంకుల్లో నీటిని నింపి ఆర్డర్లపై ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ట్రిప్పుకు రూ. 500 నుండి వెయ్యి రూపాయల వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఎన్ని ట్రిప్పులు నీటిని సరఫరా చేస్తే అన్ని డబ్బులు ఎక్కువ వస్తాయన్న ఉద్దేశంతో నీటిని నింపుకున్న వాటర్ యాంకర్లు మోతాదుకు మించిన స్పీడుతో వెళ్లి నీటిని సరఫరా చేసి అదే స్పీడ్ తో మళ్ళీ నీటిని నింపుకోవడానికి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు డ్రైవర్లు డబ్బుల కోసం ఎక్కువ ట్రిప్పులు కొట్టాలన్న ఉద్దేశంతో వాటర్ ట్యాంకర్లను స్పీడ్ గా నడుపుతూ రోడ్లపై ప్రమాదకరంగా తిరుగుతున్నాయి. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు వీలైతే ఎక్కువ ట్రిప్పులు కొట్టాలన్న ఉద్దేశంతో అతివేగంగా వాటర్ ట్యాంకర్లను నడుపుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఇందులో భాగంగానే మేడ్చల్ పట్టణం కేఎల్ఆర్ వెంచర్ ఫేస్ 3 లో వాటర్ ట్యాంకర్ అతివేగంగా వెళుతూ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు లేకపోవడం. ట్యాంకర్ బోల్తా పడి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. దీంతో విద్యుత్తు తీగలు ఒకదానిపై ఒకటి అల్లుకొని భారీ మెరుపులు చెలరేగాయని స్థానికులు తెలిపారు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లేకుంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో వాటర్ ట్యాంక్ ధ్వంసం కాగా డ్రైవర్ సైతం స్వల్పంగా గాయపడ్డారని తెలుస్తోంది. టాంకర్ బోల్తా పడడానికి కారణం అతివేగమేనని స్థానికులు పేర్కొంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించుకోవాలన్న ఉద్దేశంతో వాటర్ ట్యాంకర్లను అతివేగంగా ప్రమాదంగా నడుపుతూ మేడ్చెల్ లో హల్చల్ సృష్టిస్తున్నారు. ఉదయం వేళలో ఎటు చూసినా వాటర్ ట్యాంకర్ లే దర్శనమిస్తాయి.



**లైసెన్సు లు లేకుండానే...**

అతివేగంగా ప్రమాదకరంగా నడుపుతున్న కొందరు డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేవని తెలుస్తుంది. వేసవికాలం కావడం, నీటి ఎద్దడి ఏర్పడడం.. మంచినీటి కోసం మంచి డిమాండ్ ఉండడంతో పాఠశాలలకు కళాశాలలకు విద్యార్థులు సైతం వాటర్ యాంకర్లను నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ సమయం లో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో అతి వేగంగా, ప్రమాదకరంగా వాటర్ ట్యాంకులను నడుపుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ పట్టణంలో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్లు ఉండడంతో ఈ సంవత్సరం వందల సంఖ్యలో వాటర్ ట్యాంకర్లు నడుస్తున్నాయని తెలుస్తుంది. ప్రజల డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని భూగర్భ జలాల నుండి నీటిని తోడి అమ్ముకుంటున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.





**వ్యవసాయ బోర్ల నుండి నీటి తరలింపు**

వ్యవసాయ బోర్ల నుండి నీటిని తోడి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడ్చెల్ లో నెలకొన్న నీటి ఎద్దడి వల్ల మేడ్చల్ పట్టణంలోని పలు ప్రాంతాలలో ఈ మంచినీటి దందా వ్యవహారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. గతంలో కన్నా ఈసారి మేడ్చల్ పట్టణ మంచినీటి ఎద్దడిని ఎక్కువగా ఎదుర్కోవడంతో మంచినీటి కోసం ఫుల్ డిమాండ్ ఏర్పడింది. దీంతో పలువురు మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నీటిని అమ్ముకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. భూగర్భ జలాల నుండి తోడే మంచినీటి కి వ్యవసాయం కోసం మంజూరైన బోర్లను వాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ బోర్లకు కరెంటు బిల్లును ఉచితం కాబట్టి దాదాపు ఎక్కువ శాతం ఈ బోర్ల నుండి నీటిని తోడి నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిని అరికట్టాల్సిన విద్యుత్ శాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉండడం వల్ల యదేచ్ఛగా

వ్యవసాయ బోర్ల నుండి నీటిని తోడుతూ కుళాయిలో నింపి అమ్ముకుంటున్నారని జోరుగా విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు









**- హఠ యోగ ఆశ్రమం ఆధ్వర్యంలో యోగా విన్యాసాలు**

**- ఆశ్రమానికి స్థల కేటాయింపునకు కృషి చేస్తానన్న వజ్రేష్ యాదవ్.**

కీసర / జవహర్ నగర్, జూన్ 21 (మనం న్యూస్): జవహర్ నగర్ అంబేద్కర్ నగర్లోని ఫ్లవర్ గార్డెన్లో హఠ యోగ ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శంకరాచారి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా శంకరాచారి శిక్షణలో పిల్లలు, యువత, ప్రజాప్రతినిధులు యోగా ఆసనాలు, సూర్యనమస్కారాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. యోగ సాధన ఆరోగ్యానికి ఎంతో అవసరమని వజ్రేష్ యాదవ్ పేర్కొంటూ, యోగ విద్యను ప్రజలకు చేరువ చేస్తున్న హఠ యోగ ఆశ్రమ సేవలను అభినందించారు. ఆశ్రమానికి భవిష్యత్తులో రెండు ఎకరాల స్థలం కేటాయింపునకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి): సీఎంఆర్ ఫీడర్ కండ్లకోయ లీడర్ కింద నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ కే విజయ్ కుమార్ తెలిపారు 11 కెవి సీఎంఆర్ లీడర్, 11 కె.వి ఐడిఏ పండ్లకోయ ఫీడర్ కింద చెట్ల కటింగు మెయింటెనెన్స్ పనులు ఉన్నందున విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఏ ఈ తెలిపారు. 11 కెవి సీఎంఆర్ లీడర్ కింద ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, 11 కెవి ఐడిఏ కండ్లకోయ పీటర్ కింద మధ్యాహ్నం 1 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. సీఎంఆర్ కాలేజీ, సింధు హాస్టల్, హెచ్.బి పెట్రోల్ బంక్, రాగ కావేరి సీడ్స్ సుతారిగూడ, ఆక్సిజన్ పార్కు, జీవీకే లో కరెంటు సరఫరా లో అంతరాయం ఉంటుందని ఏఈ విజయకుమార్ తెలిపారు.

# అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి డా.చంద్రకళ మీడియాతో మాట్లాడుతూ,

యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా, శరీరం, మనస్సు ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే సమగ్ర జీవన విధానమని తెలిపారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను తగ్గించుకోవచ్చని, అలాగే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అసంక్రమిత వ్యాధులను నివారించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.




ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత భావోద్వేగ సమతుల్యతను పొందవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని విద్యార్థులు ప్రజలందరికీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా యోగా ఆసనాలు, ప్రాణాయామం ధ్యాన విధానాలను ప్రదర్శించి, యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లావణ్య రెడ్డి,

జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. నాగరాజ్,డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. గోలి శ్రీకాంత్, ఆయుష్ విభాగానికి చెందిన ఆయుర్వేద వైద్యాధికారి డా. శ్రీదేవి, హోమియో వైద్యాధికారి డా. అనఘ, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## చేవెళ్ల మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షుడిగా శ్రీపతి, ఉపాధ్యక్షుడిగా ఇంజమూరి రాజేందర్ గౌడ్**

**- రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నియామకం**

చేవెళ్ల, జూన్ 21 (మనం న్యూస్): చేవెళ్ల మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ పర్యవేక్షణలో స్థానిక సభ్యులందరూ సమావేశమై ఈ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఫోరం అధ్యక్షుడిగా శ్రీపతి, ఉపాధ్యక్షుడిగా గొల్లగూడ గ్రామానికి చెందిన ఇంజమూరి రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మున్నూరు మహేందర్, కోశాధికారిగా ఎండి నవాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా న్యాలత గోవర్ధన్ మధుసూదనరెడ్డి, కమిటీ కార్యవర్గ సభ్యులుగా గుండ్ల శ్రీకాంత్, రావులపల్లి బూర్ల అనూష అంజనీకుమార్ ఎంపికయ్యారు. ఫోరం సలహాదారుగా అల్లూరు గ్రామానికి చెందిన మోకిల మనీషా నవనీతం గౌడ్ను కమిటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.




## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): ఉమ్మడి శామీర్పేట మండలం అలియాబాద్ లోని నర్సింగ్ కళాశాల ఆవరణలో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలను మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఘనంగా నిర్వహించింది.ఈ సందర్భంగా శామీర్ పేట మండలం లోని అలియాబాద్ లో ఉన్న మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన నర్సింగ్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ తో పాటూ బాబా అటమిక్ రీసెర్చి సెంబర్, శాస్త్రవేత్త డాక్టర్ రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో యోగా గురువు పేర్కొన్నట్లు సిబ్బంది, నర్సింగ్ కళాశాల స్కూలు విద్యార్థి, విద్యార్థినులు యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె శివరామకృష్ణ మాట్లాడుతూ యోగా ఏదో వ్యాయామం చేసే ప్రక్రియ కాదని శరీరంలోని ప్రతి అవయవాన్ని కదిలించే విశిష్టత కలిగినదని పేర్కొన్నారు. యోగా భారతదేశానికి ప్రకృతి ప్రసాదించి వరమని అలాంటి యోగా వైపు ఈ రోజు ప్రపంచ ప్రజలందరూ చూడడం ఎంతో గర్వకారణంగా భావించాలని చెప్పారు. నిత్యం యోగా అభ్యసించడం ద్వారా యువత నిత్య చైతన్యవంతులు కావచ్చని అందు చేత యోగాను నిరంతరం చేయడం ద్వారా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాలలో డా మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్, అకడమిక్స్, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి,కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## ప్రజల హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే: కూనంనేని

**- సీపీఐ రాజకీయ శిక్షణా తరగతుల్లో పిలుపు**

**- ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలి**

కాప్రా, జూన్ 21(మనం న్యూస్): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఐ నాయకుల రాజకీయ శిక్షణా తరగతులు ఈసీఐఎల్లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజల హక్కులు, కార్మికుల సంక్షేమం, నిరుపేదల గృహాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని అన్నారు. సమాజంలో అసమానతలు, దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టుల అవసరం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు స్థానిక సమస్యలను తెలుసుకుని ప్రజల తరపున పోరాడాలని సూచించారు.

కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్, రాష్ట్ర నాయకులు వి.ఎస్. బోస్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు తమ గీతాలతో చైతన్యం కల్పించారు.



# జిహెచ్ఎంసి అధికారులా...మజాకా...

## ట్యాంకుల నుండి నీరు వృధాగా పోతున్న పట్టించుకోని అధికారులు ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా జర నీటిని కాపాడండి సార్

మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి): ఒకపక్క మేడ్చల్ పట్టణం మంచి నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటే. ట్యాంకుల లీకేజీ నుండి నీరు ఏరులై పారుతున్న సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రజలు మంచి నీటిని కొనుక్కొని తాగుతుండగా



ఇక్కడ మాత్రం నీరు వృధా గా రోడ్లపై ఏరులై పారుతుంది. అయినా జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేల వేల రూపాయలు ఖర్చు చేసి మంచినీటిని కొనుకుంటుంటే జిహెచ్ఎంసి అధికారులు మాత్రం వృధాగా పోతున్న నీటిని అడ్డుకోలేకపోతున్నారు అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. జర నీటిని కాపాడండి సార్ అంటూ పట్టణ ప్రజలు జిహెచ్ఎంసి అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. గత కొద్ది రోజుల నుండి మేడ్చల్ పట్టణంలో తీవ్ర నీటి మంచినీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ పట్టించుకోని అధికారులు ఇలా నీటిని వృధా చేయడంపై పట్టణవాసులు మండిపడుతున్నారు. ట్యాంకర్ కు రూ. 500 చొప్పున తెప్పించుకొని నీటిని వాడుకుంటుంటే జిహెచ్ఎంసి అధికారులు మాత్రం మంచినీటి ట్యాంకు నుంచి నీరు వృధాగా పోతుంటే చోద్యం చూస్తున్నారు అంటూ ఆరోపిస్తున్నారు.

**ఆర్టీసీ కాలనీలో..**

మేడ్చల్ పట్టణ ఆర్టీసీ కాలనీలో ని మంచినీటి ట్యాంకు నుండి లీకేజ్ ద్వారా మంచినీరు వృధాగా పోతుంది. లీకేజ్ ద్వారా నీరు బయటకు వస్తూ రోడ్లపై ఏరులై పారుతుంది. అసలే రోడ్లు అంతంత మాత్రం. దీనికి తోడు రోడ్లపై నీరు ఏరులై మారడం వల్ల ప్రయాణికులకు ప్రయాణం ప్రమాదంగా మారింది. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లిన దానిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని




స్థానికులు ఘాటుగా విమర్శిస్తున్నారు. ఒకపక్క పట్టణవాసులు మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటే మరుపక ఇలా నీరు వృధాగా పోతుండడం వల్ల ఉసురు అనిపిస్తుందని స్థానిక వాసులు వాపోతున్నారు. ఇదే కాకుండా నగరంలోని పలు మంచినీటి ట్యాంక్ లకు ఉన్నాయని కొన్ని ట్యాక్ లు శిథిలావస్థకు చేరాయని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఈ ట్యాంకులపై ప్రత్యేక దృష్టి సారించి వృధాగా పోతున్న నీటిని అడ్డుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



# జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలి

**కూరెల్లి నాగరాజు గౌడ్**
**లాలాపేట లో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి..**

తార్నాక, జూన్ 21 (మనం న్యూస్) లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం వద్ద తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కూరెల్లి నాగరాజు గౌడ్ పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, కృష్ణస్వామి, రాజలింగం, వంజరి వెంకటేష్, గిరి, డెంజిల్, పరశురామ్, రాజు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నీట్ అభ్యర్థికి అండగా నిలిచిన ఓయూ సిటీ పోలీసులు

సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) నీట్ పరీక్షకు హాజరయ్యే ఓ విద్యార్థిని సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేలా సహకరించి హైదరాబాద్ సిటీ పోలీసులు తమ సేవా దృక్పథాన్ని మరోసారి చాటుకున్నారు. ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నీట్ పరీక్ష నిర్వహణ సందర్భంగా ఓ విద్యార్థిని తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించిన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. మహేష్ వెంటనే స్పందించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న ఆయన పోలీస్ పెట్రోల్ వాహనాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినిని సురక్షితంగా పరీక్షా కేంద్రానికి చేర్చారు. పరీక్షా కేంద్రానికి రిపోర్టింగ్ సమయానికి ముందుగానే చేరుకోవడంతో విద్యార్థిని ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షకు హాజరయ్యే అవకాశం కలిగింది. పోలీసుల సకాలంలో అందించిన సహాయంపై విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పోటీ పరీక్షలు, అత్యవసర పరిస్థితులు, ప్రజా కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అండగా నిలవడంలో హైదరాబాద్ సిటీ పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని ఈ ఘటన మరోసారి నిరూపించిందని అధికారులు పేర్కొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు అని ఇన్స్పెక్టర్ ఎం. మహేష్ తెలిపారు.




# మహిళా గ్రూపులకే కాదు.. అందరికీ ఇందిరమ్మ చీరలు ఇవ్వాలి: పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) నిరుపేదలకు ప్రయోజనం కల్పించే సంక్షేమ కార్యక్రమాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సక్రమంగా కొనసాగించడంలో విఫలమవుతోందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ విమర్శించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి మహిళలందరికీ చీరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే చీరలు పంపిణీ చేయడం సమంజసం కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్మస్ కానుకలు వంటి పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. మహిళలందరికీ బతుకమ్మ చీరలు అందించేందుకు రేషన్ దుకాణాలు, ప్రత్యేక పంపిణీ కేంద్రాల ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అవసరమైతే అదనపు నిల్వలను సమకూర్చి అర్హులందరికీ చీరలు అందించామని చెప్పారు. ప్రస్తుతం కూడా మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే పరిమితం కాకుండా అన్ని అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుధీర్ సింగ్, యూసీడీ ప్రాజెక్టు అధికారి రజిత రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కంది శైలజ, సామాల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.



# మహిళ అదృశ్యం..

**కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు..**
**రమాదేవి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు..**
**మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.**



కుషాయిగూడ, జూన్ 21 ( మనం న్యూస్): కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగారం నివాసి పెంట శ్రీను తన భార్య రమాదేవి (33) కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు 15 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 20న హెచ్బి కాలనీలోని తన అత్తమామల ఇంట్లో ఉన్న రమాదేవి మధ్యాహ్నం సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె వద్ద సెల్ఫోన్ కూడా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కుషాయిగూడ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఫాథర్స్ డే సందర్భంగా నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ సేవలు


సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) ఫాథర్స్ డే సందర్భంగా స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని రోడ్ల పక్కన, ఫుట్పాత్లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల కుటుంబాలను గుర్తించి వారికి దుస్తులు, బూట్లు, చెప్పులు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. సమాజంలోని బలహీన వర్గాలకు మానవతా దృక్పథంతో తోచినంత సహాయం అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు వై. సంజీవ్ కుమార్ మాట్లాడుతూ అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. స్థానికులు ఫౌండేషన్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

## ఓయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఉస్మానియా విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా సాధనపై ప్రత్యేక శిక్షణతో పాటు యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ప్రముఖ్ డా. రామకృష్ణ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అపూర్వమైన జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు, మానసిక ఆందోళనలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. యోగా శిక్షకురాలు షర్మిల విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రాఘవేందర్, డా. శ్రీహరి, గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీతేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు డా. జీవన్, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరి ప్రసాద్, స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్ గంధం నరేందర్, విద్యానగర్ జిల్లా కన్వీనర్ సాయి తేజ, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షుడు గెల్లు శేఖర్, కార్యదర్శి మోక్షిత్తో పాటు దినేష్, భాస్కర్, శివ, పూర్ణ, శ్రీధర్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయి గీత ఆశ్రమంలో ఘనంగా అంతర్జాతీయ యోగా వేడుకలు






మెడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా కండ్లకోయలోని సాయి గీత ఆశ్రమం లో 550 దివ్య వృక్షాల నడుమ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పూజ్య సద్గురు శ్రీ శ్రీ శ్రీ సాయికుమార్ సన్నిధిలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగాచార్యులు శ్రీనివాస్ పుల్లూరి యోగా రంగంలో 25 సంవత్సరాల అనుభవం కలిగిన నిపుణులు, వివిధ యోగా ఆసనాలను నిర్వహించి పాల్గొన్న వారికి యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పూజ్య సద్గురు సాయికుమార్ యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ఆధ్యాత్మిక ప్రయోజనాలను వివరించారు. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఎంత తినాలి, ఎలా తినాలి, ఎప్పుడు తినాలి, సూపర్ యోగా యొక్క ప్రయోజనాలు, నిత్యజీవితంలో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే మార్గాలపై విలువైన సూచనలు అందించారు. ప్రకృతి మధ్య నిర్వహించిన ఈ యోగా మహోత్సవంలో పాల్గొన్న వారందరూ ఉత్సాహంగా యోగా సాధనలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఆరోగ్యం, ఆనందం ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడే వేడుకగా నిలిచింది.

# దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: పరమేశ్వర్ రెడ్డి



సికింద్రాబాద్ జూన్ 21 (మనం న్యూస్) మల్లాపూర్లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ కమ్యూనిటీ హాల్ విస్తరణతో పాటు నోమ కళ్యాణ వేదిక పక్కన ఉన్న ఎస్సీ మాదిగల హిందూ శ్మశానవాటికను ఆక్రమణదారుల కబ్జా నుంచి విముక్తి చేసి ఆధునికంగా అభివృద్ధి చేయాలని అరుంధతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిని కోరారు. ఆదివారం సొసైటీ అధ్యక్షుడు ఏడల గణేష్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం పరమేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా స్పందించిన పరమేశ్వర్ రెడ్డి, బాబు జగ్జీవన్ రామ్ పేరుతో ఉన్న భవన్కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎస్సీ మాదిగ సోదరుల శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సమస్యపై వెంటనే రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. శ్మశానవాటిక స్థలంలో ఆక్రమణలు ఉన్నట్లయితే వాటిని తొలగించి, ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అవసరమైతే ఈ అంశాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా తీసుకెళ్తానని వెల్లడించారు. దళిత సోదరుల ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని, సామాజిక న్యాయం సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏడల గణేష్, వెంకట్ ప్రసాద్, లక్ష్మీపతి, రవి, మురళి, ఉదయ్, మహేష్, శివశంకర్, వినయ్, ప్రణయ్, ధనరాజ్, సుధాకర్ ప్రసాద్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి గౌడ్, నెమలి అనిల్, బెల్లం శ్రీను, టిల్లు ముదిరాజ్, విజయ్ రెడ్డి, బాలరాజ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్నగర్లో అక్రమ మద్యం దందాపై ఎక్సైజ్ ఉక్కుపాదం

- గోవా మద్యం, డ్యూటీ పేడ్ లిక్కర్ భారీగా స్వాధీనం..
- ఇద్దరు అక్రమ వ్యాపారులపై కేసులు నమోదు..
- చట్టవిరుద్ధ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.





జవహర్నగర్, జూన్ 21 (మనం న్యూస్): అక్రమ మద్యం దందాపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన డీటీఎఫ్ మల్కాజిగిరి, కాప్రా ఎక్సైజ్ పోలీసుల సంయుక్త బృందాలు జవహర్నగర్ పరిసర ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి భారీ మొత్తంలో గోవా/విదేశీ మద్యం, డ్యూటీ పేడ్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాయి.

దాడుల్లో భాగంగా వెంకటేశ్వర కాలనీకి చెందిన రెడ్డిశెట్టి మహేష్ నివాసంలో 59 సీసాల గోవా/విదేశీ మద్యం (51.55 లీటర్లు) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే మోహన్రావు కాలనీకి చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ వద్ద 112 సీసాల గోవా/విదేశీ మద్యం (75.75 లీటర్లు), తెలంగాణలో విక్రయానికి అనుమతించబడిన 251 సీసాల డ్యూటీ పేడ్ మద్యం (129.66 లీటర్లు) పట్టుకుని కేసు నమోదు చేశారు.

అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు చట్టవిరుద్ధ మద్యం విక్రయాలు, నిల్వలపై సమాచారం అందించి సహకరించాలని కోరారు. కేసులు నమోదు చేసిన అనంతరం నిందితులను బీఎన్ఎస్ఎస్-2023 సెక్షన్ 35(3) ప్రకారం బెయిల్పు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ధ్యేయం

**నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశం లో పాల్గొన్న మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి**



మేడ్చల్, జూన్ 21 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్ గ్రామంలో చిన్న సాయిగారి బుచ్చమ్మ,భిక్షపతి ల నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని,రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు,పట్టణాలు లేవని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని,ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి తో పాటు మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొడె మహేష్ కురుమ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొంట యాదయ్య,తొంట సుధాకర్,రాములు,నర్సింహ్మా,వేముల రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీనాయకులు,

కార్యకర్తలు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఓయూలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (సీఎఫ్ఆర్డి ) భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యోగా అండ్ మెడిటేషన్ క్లబ్, ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ( ఐక్యూఏసి ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సిరీష, యోగా అండ్ మెడిటేషన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. విజయ భాస్కర్ రెడ్డి, సీఎఫ్ఆర్డీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుజాత, వివిధ విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇషా ఫౌండేషన్కు చెందిన హఠ యోగా సాధకురాలు విష్ణు ప్రియ ప్రత్యేక యోగా శిక్షణా సదస్సును నిర్వహించారు. యోగా ఆసనాలు, శ్వాస వ్యాయామాలు, ధ్యాన పద్ధతులపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగ ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే థీమ్తో నిర్వహించబడింది. ఈ సందర్భంగా మాట్లాడిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని పేర్కొన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, అంతరంగిక సమతుల్యత సాధించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఈ థీమ్ తెలియజేస్తోందని అన్నారు. అనంతరం నిర్వహించిన ధ్యాన కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విశ్వవిద్యాలయ సమాజానికి నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో 'ఇంద్రమ్మ' చీరల పంపిణీ

**మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మోతే శ్రీలత శోభన్ రెడ్డి..**



సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్లో మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్జీ) సభ్యులకు 'ఇంద్రమ్మ' చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఆదం సంతోష్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం సభ్యుడు మోతే శోభన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు స్వయం ఉపాధి రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు సంక్షేమ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు తక్కువ వడ్డీ రుణాలు, ఆర్థిక సహాయం, శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చిన్నతరహా కార్మికులు, గృహ కార్మికులు, నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళల ఆదాయ వృద్ధికి దోహదపడేలా వివిధ వ్యాపార, సేవా రంగాల్లో స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు తదితర ఆదాయ వనరులను కల్పించే కార్యకలాపాల బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 7.10 లక్షల మంది మహిళలకు 'ఇంద్రమ్మ' చీరలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు మోతే శ్రీలత శోభన్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కె.ఎస్. శిల్పా చారి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.







# యోగాతో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపు..

**సెరినిటీ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం.. విద్యార్థుల యోగా ఆసనాలు, ప్రాణాయామ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.**

కీసర, నాగారం, జూన్ 21 (మనం న్యూస్) : కీసర మండలంలోని సెరినిటీ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగా ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోనో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా అలవాటు చేసుకోవడం వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ పెరిగి శారీరక-మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రాణాయామం, ధ్యానం, వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్, అడ్మినిస్ట్రేటర్ సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యం, కుటుంబ సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య



సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) అనారోగ్యం, కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం, మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన ఎం. రవీంద్రరావు (78) శనివారం తెల్లవారుజామున బొల్లారం - బొల్లారం బజార్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఇంట్లో ఉన్న సమస్యల కారణంగా భార్యపై కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం తీవ్ర మనస్తాపానికి గురై ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఈఎంఆర్సీలో ఆధునిక డిజిటల్ స్టూడియో ప్రారంభం

సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ మీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్సీ)లో అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసిన నూతన డిజిటల్ స్టూడియోను ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ప్రారంభించారు. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ (సీఈసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పరీక్షత్ సింగ్ మన్హాస్, యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జితేంద్ర కుమార్ త్రిపాఠితో కలిసి ఆయన స్టూడియోను ప్రారంభించి, రీ ఎన్విజనింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ డిజిటల్ ఎరా - టువరడ్స్ వికసిత్ భారత్ 2047 పేరుతో రూపొందించిన పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలై సెమిస్టర్లో సీఈసీ-ఈఎంఆర్సీ







అందిస్తున్న 11 స్వయం ఆన్లైన్ కోర్సుల పోస్టర్లను విడుదల చేసి, పలు విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ డిజిటల్ విద్యారంగంలో ఉన్న అపార అవకాశాలను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన ఆన్లైన్ పాఠ్యాంశాల రూపకల్పన ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందించవచ్చని పేర్కొన్నారు. మూక్స్ కోర్సులు దేశవ్యాప్తంగా ఒకే ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. సీఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పరీక్షత్ సింగ్ మన్హాస్ మాట్లాడుతూ దేశంలోని 20 ఈఎంఆర్సీల్లో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న కేంద్రాల్లో ఓయూ ఈఎంఆర్సీ ఒకటిగా నిలిచిందని ప్రశంసించారు. డిజిటల్ విద్యపై పరిశోధనలను ప్రోత్సహిస్తూ, భవిష్యత్తులో పరిశోధనా ప్రాజెక్టులు, మూక్స్ కోర్సుల రూపకల్పనలో ఓయూ ఈఎంఆర్సీకి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జితేంద్ర కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ ఓయూ ఈఎంఆర్సీ పనితీరును అభినందిస్తూ, 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవన మరమ్మతుల కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేంద్ర కుమార్ నాయక్, ఈఎంఆర్సీ డైరెక్టర్ పి. రఘుపతి, ప్రొఫెసర్ బి. లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగా అవసరం

**దక్షిణ మధ్య రైల్వేలో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం..**




సికింద్రాబాద్, జూన్ 21 (మనం న్యూస్) 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దక్షిణ మధ్య రైల్వే ఆదివారం సికింద్రాబాద్లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించింది. ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే ఈ ఏడాది థీమ్కు అనుగుణంగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, పాఠశాల విద్యార్థులు, యోగా ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్, ప్రముఖ యోగా గురువు మురారి మోహన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలపై పాల్గొనేవారికి అవగాహన కల్పించారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరం, మనస్సు, ఆత్మల సమన్వయానికి దారితీసే జీవన విధానమని మురారి మోహన్ పేర్కొన్నారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ, మెరుగైన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాల్గొన్న వారితో యోగా సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.



కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన యోగా గురువు మురారి మోహన్ను ఆయన అభినందించారు. అంతకుముందు కోల్కతాలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని అధికారులు, సిబ్బంది వీక్షించారు. ఆ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని యోగా ప్రాముఖ్యతపై ప్రసంగించారు. జోన్లోని ఇతర ప్రాంతాల సిబ్బంది కూడా వీక్షించేందుకు ఈ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు.

# ప్రభుత్వ స్థలాల కబ్జాను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి

**బిజెపి బిల్డర్ సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు**



(మనం న్యూస్ జూన్ -21) : మేడిపల్లి: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి సర్వే నెంబర్ 103 లో ప్రభుత్వ స్థలం రోజురోజుకు కనుమరుగవు ఉందని, ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని బిజెపి బిల్డర్ సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు మేడ్చల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో పేదోడి పేరుతో కొంతమంది దళారులు మేడిపల్లి సర్వేనెంబర్ 103 లో రాత్రి రాత్రి నిర్మాణాలు చేయడం పరిపాటిగా మారింది. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ స్థలాలు దళారులు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, వీటిపై పలుమార్లు మేడిపల్లి తహసిల్దారు,ఆర్ఐల దృష్టికి తీసుకువచ్చిన ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలకు వ్యక్తమవుతున్నాయి.మేడిపల్లి ఆర్ ఐ పరోక్షంగా ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడమే కాకుండా అందిన కాడికి దండుకుంటూ దళారులకు కొమ్ముకాస్తున్నారని బిజెపి బిల్డర్ సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు ఆరోపించారు. మేడిపల్లి సర్వే నెంబర్ 103 లోని ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వం ఎవరెవరికి ఎంత కేటాయించిందని నిర్ధారించాలని , గత ప్రభుత్వంలో హెచ్ఎండిఎ ఈ యాక్షన్ పేరిట ప్రైవేటు వ్యక్తులకు విక్రయించిందని, ఈ యాక్షన్ లో కొన్న వ్యక్తులు కొనుగోలు చేసిన స్థలం కంటే అదనంగా కొంత స్థలాన్ని ఆక్రమించుకున్నారని స్థానిక ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీటిపై పూర్తిస్థాయిలో మేడిపల్లి మండల తహసిల్దార్ సర్వే నెంబర్ 103 లో అక్రమాలను పూర్తిస్థాయిలో పరిశీలించి కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పాలకుర్తి శేషగిరి రావు రెవెన్యూ అధికారులను కోరారు.

**జెసి ఆదేశాలు బేఖాతార్...**

సర్వేనెంబర్ 103 లోని ప్రభుత్వ స్థలం కబ్జా అక్రమ నిర్మాణాలపై మేడిపల్లి తహసిల్దార్, ఆర్ ఐ కి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ కు పిర్యాదు చేశారు. దీనిపై స్పందిస్తూ జాయింట్ కలెక్టర్ ఎమ్మార్వో కు ఫోన్ చేసి ఫిర్యాదును పరిశీలించవలసిందిగా ఆదేశించగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా తహసిల్దార్ ఆర్ఐలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఉన్నతాధికారుల ఆదేశాలను బేకాతర్ చేయడమే అవుతుందని శేషగిరిరావు అన్నారు.